కన్నడ కాంగ్రెస్‌లో కుర్చీలాట

> మొదటిపేజీ తరువాయి...

నాయకుడినే సీఎంగా ప్రకటిస్తారని గట్టి నమ్మకంతో ఉండటంతో వివాదాలు తీవ్రమయ్యాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వెనుకబడినవర్గానికి (ఓబీసీ) చెందిన సిద్ధరామయ్యను పార్టీ సీఎంగా ప్రకటించడంతో డీకే వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లోలోన అసమ్మతితో రగులుతున్న డీకే కూడా సిద్ధరామయ్యకు చెక్ పెట్టేందుకు ప్రయత్నించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర పార్టీ, ప్రభుత్వం కూడా రెండు వర్గాలుగా చీలినట్టు తెలుస్తున్నది. గ్రూపు రాజకీయాలు జోరందుకున్నాయి. సీఎం మార్పు, క్యాబినెట్ మార్పులపై నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. మాండ్య ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఇటీవల మాట్లాడుతూ ప్రభుత్వ రెండున్నరేండ్ల టర్మ్ తర్వాత డీకే శివకుమార్ సీఎం అవుతారని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన కొంత మంది మంత్రులు సిద్ధరామయ్యేనే పూర్తి కాలం సీఎంగా ఉంటారని పేర్కొనగా, దానిపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకోవాలని మరికొంత మంది వ్యాఖ్యానించారు. మరోవైపు క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై సీనియర్ నేత, అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్ అశోక్ పట్టాన్ మాట్లాడుతూ రెండున్నరేండ్ల తర్వాత మంత్రి వర్గంలో మార్పులు ఉంటాయని సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్ తనతో చెప్పారని పేర్కొన్నారు. ఇదే సమయంలో పలు కార్పొరేషన్లు, బోర్డులకు చైర్మన్ల నియామకాల్లో తమ వర్గానికి అన్యాయం జరుగుతున్నదని ఇటు సిద్ధు వర్గం నేతలు, అటు డీకే వర్గం నేతలు తీవ్రస్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకొన్నారు. ఇలా కాంగ్రెస్‌లోని అంతర్గత కుమ్ములాటలు ముదిరిపాకాన పడ్డాయి.

సతీశ్ ఎంట్రీతో మరింత హీట్

ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి ఎంట్రీతో కర్ణాటక కాంగ్రెస్‌లో సంక్షోభం మరింత తీవ్రమైంది. సిద్ధరామయ్యకు విశ్వాసపాత్రుడైన ఈయన.. ఉప ముఖ్యమంత్రి స్థానం కోసం పట్టుబడుతున్నారు. అయితే, దానికి డీకే మోకాలడ్డుతున్నారు. దీంతో తనకు కంచుకోట అయిన బెళగావి రాజకీయాల్లో డీకే జోక్యం చేసుకుంటున్నారని, ఆయనకు విశ్వాసపాత్రురాలైన మరో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని సతీశ్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీన్ని పార్టీకి తెలిసేలా.. తనకు మద్దతుగా ఉన్న ఇరవై మంది ఎమ్మెల్యేలతో మైసూరు దసరా వేడుకల సమయంలో ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. డీకే తెలంగాణ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమైన సమయంలో ఇది జరుగడం గమనార్హం. అయితే సతీశ్ ఇదంతా తన బలప్రదర్శన కోసమే చేస్తున్నాడని గుర్తించిన అధిష్ఠానం.. సిద్ధరామయ్య ద్వారా వ్యవహారాన్ని చక్కబెట్టింది. అయితే, బెళగావిలో తన ప్రాధాన్యాన్ని డీకే వర్గీయులు మరింతగా తగ్గిస్తుండటం, కార్పొరేషన్లు, బోర్డులకు ఛైర్మన్ల నియామకాల్లో తన అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడంతో తన ఎమ్మెల్యేలతో త్వరలో కచ్చితంగా క్యాంప్ పెడుతానని సతీశ్ పార్టీకి అల్టిమేటం జారీ చేశారు.

సీరియస్ వార్నింగ్

కర్ణాటక కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు ఆ పార్టీ అధిష్ఠానాన్ని కలవరానికి గురిచేస్తున్నాయి. పరిస్థితిని చక్కబెట్టేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలాకు బుధవారం ఢిల్లీ నుంచి బెంగళూరుకు హుటాహుటిన చేరుకొని సిద్ధరామయ్య, డీకేతో దాదాపు రెండున్నర గంటలపాటు సమావేశమయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన ప్రకటనలపై చర్చించామని తెలిపారు. ఎవరూ పార్టీ లైన్ దాటి ప్రవర్తించకుండా చూడాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడికి సూచించినట్టు చెప్పారు. ఎవరికైనా భిన్నాభిప్రాయాలు ఉంటే తమకు తెలుపాలని సూచించారు. బహిరంగంగా ప్రకటనలు చేస్తే మాత్రం సహించబోమని హెచ్చరించారు.

ప్రకంపనలకు అడ్డాగా బెళగావి

ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సంక్షోభానికి బెళగావి నేతల మధ్య మొదలైన ప్రచ్ఛన్న యుద్ధమే కారణంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని మాజీ మంత్రి మునిరత్న కూడా చెప్పారు. బెళగావిలో అత్యంత శక్తిమంతమైన తమ నేత సతీశ్ జార్కిహోళి ప్రాభవాన్ని డీకే వర్గం కావాలనే తగ్గించడానికి ప్రయత్నిస్తున్నదని సతీశ్ వర్గీయుల ఆరోపణ. ఇందులో భాగంగానే మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను డీకే ప్రోత్సహిస్తున్నారని మండిపడుతున్నారు.

తానొక్కడినే ఉండాలనుకొన్న డీకే

మేలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు మొత్తం నాలుగు ఉపముఖ్యమంత్రి స్థానాలు సృష్టించాలని అధిష్ఠానం భావించింది. సతీశ్‌కు కూడా డిప్యూటీగా అవకాశం ఇవ్వాలనుకొన్నట్టు వార్తలొచ్చాయి. అందుకు డీకే విముఖత చూపించారు. తాను ఒక్కడినే ఉప ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పడంతో ఆయన మాటను అధిష్ఠానం అంగీకరించింది. ఇదే క్రమంలో బెళగావికి చెందిన లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను సతీశ్‌కు ప్రత్యామ్నాయంగా డీకే చేయాలనుకొన్నారు. తద్వారా సిద్ధరామయ్యకు చెక్ పెట్టొచ్చని డీకే ప్రయత్నించినట్టు విమర్శలు వచ్చాయి.

కాంగ్రెస్‌ను మళ్లీ ముంచేది బెళగావేనా?

2019లో కాంగ్రెస్, జేడీఎస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం పతనానికి బెళగావి నాయకులే కారణమయ్యారు. సతీశ్ సోదరుడు రమేశ్ జార్కిహోళి ఇందులో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు కాంగ్రెస్ పతనానికి మరోసారి బెళగావికి చెందిన సతీశ్ జార్కిహోళి, లక్ష్మీ హెబ్బాళ్కర్ మధ్య ఆధిపత్యపోరే కారణం కావడం గమనార్హం.

ఎవరీ సతీశ్ జార్కిహోళి?

బెళగావిలో అత్యంత శక్తిమంతమైన నేతగా, వ్యాపారవేత్తగా సతీశ్ జార్కిహోళికి మంచి పేరుంది. సిద్ధరామయ్యకు విశ్వాసపాత్రుడైన ఈయన 2013–18 మధ్య సిద్ధు క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఈయనకు నలుగురు సోదరులు. పెద్ద సోదరుడు రమేశ్ జార్కిహోళి బీజేపీలో కొనసాగుతున్నారు. 2019లో కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ సర్కారును కూలదోయడంలో ఈయన కీలకపాత్ర పోషించారు. మరో సోదరుడు బాలచంద్ర బీజేపీలో కొనసాగుతుండగా, ఇంకో సోదరుడు లఖన్ స్వతంత్ర ఎమ్మెల్సీ. మరో సోదరుడు భీష్మ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు నిధులు సమకూర్చడంలో సతీశ్ కీలకమని, ప్రభుత్వంలో 20 నుంచి 25 మంది ఎమ్మెల్యేలు సతీశ్ గీసిన గీత దాటరని చెబుతారు.

ఫోన్ల హ్యాకింగ్‌పై చర్చించాలి

ప్రతిపక్ష ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ: ఫోన్ల హ్యాకింగ్ వ్యవహారంపై దుమారం కొనసాగుతున్నది. 'ప్రభుత్వ ప్రాయోజిత వ్యక్తులు మీ ఫోన్ హ్యాకింగ్‌కు ప్రయత్నిస్తున్నారు' అంటూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు, నేతల ఐఫోన్లకు యాపిల్ నుంచి హ్యాకింగ్ అలర్ట్ సందేశాలు వచ్చిన విషయం తెలిసిందే. నిఘా ఆరోపణల వ్యవహారంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విపక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. హ్యాకింగ్ అలర్ట్ అంశంపై చర్చించేందుకు ఐటీ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని వెంటనే సమావేశపరచాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ కమిటీ చైర్‌పర్సన్ ప్రతాపరావ్ జాదవ్‌కు లేఖ రాశారు. యాపిల్ నుంచి ఈ సందేశాలను వచ్చిన వారిని, యాపిల్ సంస్థ ప్రతినిధులను సమావేశానికి పిలువాలని చిదంబరం తన లేఖలో కోరారు. ప్రభుత్వం అక్రమంగా పెట్టిన ఈ నిఘా ప్రాథమిక హక్కులపై దాడిగా టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా అభివర్ణించారు.

విపక్ష నేతలనందరినీ జైళ్లకు పంపే కుట్ర

వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు ముందే దేశంలోని విపక్ష నేతలనందరినీ అరెస్ట్ చేసి జైళ్లకు పంపడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. తద్వారా ఖాళీ అయిన దేశంలో తమకు తామే ఓట్లు వేసుకునేలా మోదీ ప్రభుత్వం ప్రణాళిక రచిస్తున్నది. అలాగే విపక్ష ఎంపీల ఫోన్లను కేంద్రం హ్యాక్ చేస్తున్నది.

–బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

ఐదు రాష్ర్టాల ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వెంటనే ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. విపక్షాలను బెదిరించడానికే కేంద్రం ఈ దాడులు చేయిస్తున్నది. ఇక ఇప్పుడు విపక్ష నేతల ఫోన్లు హ్యాకింగ్‌కు గురైనట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. బీజేపీకి ఓటమి భయం పట్టుకున్నది. ఐదు రాష్ర్టాల ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయం. అందుకే ఇలా ప్రవర్తిస్తున్నది.

–తమిళనాడు సీఎం స్టాలిన్

రక్తపరీక్షతో పిల్లల్లో క్షయ గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబర్ 1: చిన్నపిల్లల ఊపిరితిత్తుల్లో బ్యాక్టీరియా తక్కువగా ఉండటంతో క్షయ లక్షణాలు త్వరగా బయటపడవు. కానీ సాధారణమైన రక్తపరీక్ష లేదా ర్యాపిడ్ బ్లడ్ టెస్ట్‌లతో పిల్లల్లో క్షయను గుర్తించవచ్చునని, చికిత్స త్వరగా మొదలుపెట్టొచ్చని మ్యూనిచ్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనం వెల్లడించింది. పిల్లల శ్వాసనాళాల నుంచి కఫం లేదా శ్లేష్మం శాంపిల్స్‌ను సేకరించటం కష్టతరంగా మారిందని, సరికొత్త క్షయ పరీక్ష పద్ధతుల్ని అత్యవసరంగా రూపొందించాలని మ్యూనిచ్ వర్సిటీ ప్రొఫెసర్ లారా ఒల్‌బ్రిచ్ చెప్పారు. భారత్ సహా ఐదు దేశాల్లో సైంటిస్టులు అధ్యయనం చేపట్టినట్టు 'ద లాన్సెట్ జర్నల్' వార్తా కథనం పేర్కొన్నది.

మొబైల్ ఫోన్‌తో వంధ్యత్వం!

లండన్: అదేపనిగా మొబైల్ ఫోన్ వాడే పురుషుల్లో వీర్యం, అందులోని శుక్రకణాల నాణ్యత తగ్గిపోతున్నట్టు జెనీవా యూనివర్సిటీ పరిశోధకుల బృందం ప్రకటించింది. 2005–2018 మధ్య 2,886 మంది 18–22 ఏండ్ల మధ్య వారిపై నిర్వహించిన పరిశోధనలో ఈ విషయాన్ని గుర్తించినట్టు ఫెర్టిలిటీ అండ్ ఏఎంపీ జర్నల్‌లో ప్రచురించిన పరిశోధన పత్రంలో పేర్కొన్నది. పర్యావరణ, జీవనశైలి మార్పులతో వీర్యకణాల నాణ్యత తగ్గిపోతున్నట్టు గతంలోనే పరిశోధకులు గుర్తించారు. తాజాగా స్మార్ట్ ఫోన్ కూడా అందుకు ఒక కారణమని తేలింది. విపరీతంగా ఫోన్ వాడిన వారిలో శుక్రకణాల నాణ్యత నాణ్యత తగ్గిపోయినట్టు తేలింది.

అమెరికాలో ఖమ్మం యువకుడిపై దాడి

- పబ్లిక్ జిమ్‌లో కత్తితో పొడిచిన దుండగుడు
- పరిస్థితి విషమం
- స్పందించిన మంత్రులు కేటీఆర్, అజయ్‌కుమార్
- అవసరమైన సాయం అందిస్తామని హామీ

వరుణ్ రాజ్

వాషింగ్టన్/మామిళ్లగూడెం, నవంబర్ 1: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన 24 ఏండ్ల తెలంగాణ విద్యార్థిపై దాడి జరిగింది. ఇండియానా రాష్ట్రం వాల్పరైసో నగరంలోని పబ్లిక్ జిమ్‌లో వరుణ్ రాజ్‌పై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన వరుణ్‌ను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఖమ్మంలోని బుర్హాన్‌పురంలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుచ్చా రామ్మూర్తి కుమారుడు వరుణ్ అమెరికాలో ఎంఎస్ చదువుతూ పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. జిమ్‌లో ఉండగా, జోర్డాన్ ఆండ్రాడే అనే వ్యక్తి ఆదివారం కత్తితో వరుణ్‌పై దాడికి పాల్పడ్డాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. తనపై దాడికి వస్తున్నాడని భావించి వరుణ్‌పై కత్తితో హత్యాయత్నం చేసినట్టు నిందితుడు పోలీసులకు తెలిపాడు. వరుణ్ రాజ్‌ను ఫోర్ట్ వేన్‌లోని లూథరన్ దవాఖానకు తరలించారు.

స్పందించిన మంత్రులు కేటీఆర్, పువ్వాడ

వరుణ్‌పై దాడి విషయం తెలిసి తల్లిదండ్రులు తల్లడిల్లారు. తాము అమెరికా వెళ్లేందుకు సహకరించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను బుధవారం స్వయంగా కలిసి కోరినట్టు బాధితుడి తండ్రి రామ్మూర్తి తెలిపారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి భరోసా కల్పించారు. అలాగే ఈ విషయాన్ని ట్విట్టర్‌లో పోస్టు చేయడంతో గమనించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. బాధిత కుటుంబం అమెరికా వెళ్లేందుకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అమెరికాలోని భారత ఎంబసీ, తెలంగాణ ఎన్ఆర్ఐల ద్వారా వరుణ్ రాజ్‌కు అవసరమైన సహాయాన్ని అందిస్తానని భరోసా కల్పించారు.

'360 డిగ్రీల విధానం'పై కేంద్రం యూటర్న్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): అఖిల భారత సర్వీసు అధికారుల పదోన్నతికి సంబంధించిన వివాదాస్పద '360 డిగ్రీల' విధానంపై కేంద్రంలోని బీజేపీ సర్కారు వెనక్కి తగ్గింది. ఈ విధానాన్ని అమలు చేయట్లేదని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్‌కు (క్యాట్) ఇటీవల స్పష్టంచేసింది. తనకు పదోన్నతిని తిరస్కరించారంటూ ఐఎఫ్ఎస్ అధికారి సంజీవ్ చతుర్వేది బెంచ్ ముందు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. 360 డిగ్రీల విధానాన్ని అనుసరించి.. తనపై సేకరించిన సమీక్షా వివరాలను సమర్పించేలా కేంద్రానికి ఆదేశాలనివ్వాలంటూ అభ్యర్థించారు. ఈ క్రమంలో జరిగిన విచారణలో 360 డిగ్రీల విధానాన్ని తాము అమలు చేయట్లేదని కేంద్రం తాజాగా అఫిడవిట్ దాఖలు చేసింది. కాగా, సివిల్ సర్వీస్ అధికారులకు పదోన్నతి కల్పించే ముందు సీనియర్లు, సహోద్యోగులు, జూనియర్ అధికారులు, వినియోగదాల నుంచి అభిప్రాయాలను సేకరించే 360 డిగ్రీల విధానాన్ని తీసుకొస్తున్నట్టు 2020లో కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించింది. అయితే, ఈ విధానం వల్ల పదోన్నతుల్లో పారదర్శకత లోపించవచ్చని, పాలకవర్గానికి అనుకూలంగా ఉన్నవారికే ప్రమోషన్లు లభించవచ్చని విమర్శలు వచ్చాయి. రానున్న ఎన్నికల్లో నష్టం జరుగకూడదనే ఉద్దేశంతో కేంద్రం యూటర్న్ తీసుకొన్నట్టు సమాచారం.

దుబాయ్ నుంచి 47 సార్లు లాగిన్!

నేడు ఎథిక్స్ కమిటీ ముందుకు మహువా

న్యూఢిల్లీ, నవంబర్ 1: పార్లమెంట్‌లో ప్రశ్నలడగడానికి లంచం తీసుకుంటున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా గురించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఆమె పార్లమెంటరీ అకౌంట్ దుబాయ్ నుంచి 47 సార్లు లాగిన్ అయినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. కాగా, లంచం ఆరోపణలపై లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ముందు ఆమె గురువారం హాజరు కానున్న క్రమంలో ఈ కథనాలు రావడం విశేషం. ప్రముఖ వ్యాపార వేత్త దర్శన్ హీరానందనికి లబ్ధి చేకూర్చేందుకు ఆమె పార్లమెంట్‌లో ప్రశ్నలు వేసేవారని, దానికి ప్రతిఫలంగా ఆమె ఆయన నుంచి పెద్దయెత్తున బహుమతులు తీసుకునే వారని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

---

6 నెలల్లో 80 లక్షల మంది ఔట్

- *'ఉపాధి హామీ' జాబ్ కార్డుల తొలగింపు*
- *బీజేపీపాలిత యూపీ, ఎంపీ, కాంగ్రెస్‌పాలిత ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లోనే తొలగింపులు అత్యధికం*

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామంటూ మాటతప్పిన కేంద్రంలోని బీజేపీ సర్కారు ఉపాధి హామీ పథకాన్ని కూడా క్రమంగా నిర్వీర్యం చేస్తున్నది. గడిచిన ఆరు నెలల వ్యవధిలో (ఏప్రిల్–సెప్టెంబర్, 2023) 80 లక్షల మంది జాబ్ కార్డులను తొలగించింది. ఈ మేరకు ఎన్జీవో సంస్థ 'లిబ్‌టెక్ ఇండియా' తాజాగా వెల్లడించింది. కార్డుల తొలగింపులో బీజేపీ పాలిత యూపీ, మధ్యప్రదేశ్ తొలి రెండు స్థానాల్లో ఉండగా తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ర్టాలు ఉన్నాయి. కాగా, వేతన చెల్లింపులకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ ఏబీపీఎస్ విధానాన్ని తీసుకురావడం వల్లే కార్డుల తొలగింపు పెద్దయెత్తున జరిగినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- *కిందటేడాది అక్టోబర్‌నాటికి ఉపాధి హామీ పథకంలో యాక్టివ్ వర్కర్ల సంఖ్య–15.49 కోట్లు*
- *ఈ ఏడాది అక్టోబర్‌నాటికి ఉపాధి హామీ పథకంలో యాక్టివ్ వర్కర్ల సంఖ్య–14.33 కోట్లు*
- *ఏడాది వ్యవధిలో తొలగించిన కార్డులు – 1.16 కోట్లు*

ఆరు నెలల వ్యవధిలో ఏ రాష్ట్రంలో ఎన్ని కార్డులు తొలగించారంటే?

■ రాష్ట్రం / ■ తొలగించిన కార్డులు		
ఉత్తరప్రదేశ్	35.57 లక్షలు	
మధ్యప్రదేశ్	10.92 లక్షలు	
ఛత్తీస్‌గఢ్	9.54 లక్షలు	
రాజస్థాన్	7.72 లక్షలు	
ఒడిశా	5.77 లక్షలు	
బెంగాల్	5.55 లక్షలు	

ఈజిప్టుకు వెళ్లగొడదాం

22 లక్షల మంది పాలస్తీనియన్ల తరలింపుపై ఇజ్రాయెల్ కసరత్తు

రమల్లా, నవంబర్ 1: గాజాలోని 22 లక్షల మంది పాలస్తీనియన్లను బలవంతంగా, శాశ్వతంగా ఈజిప్ట్‌లోని సినాయ్ పెనిన్సులాకు వెళ్లగొట్టేందుకు ఇజ్రాయెల్ ప్రణాళికలు రచిస్తున్నది. మొత్తం పాలస్తీనా జనాభాను గాజా నుంచి ఖాళీ చేయించాలని ఇజ్రాయెల్ నిఘా మంత్రిత్వ శాఖ కసరత్తు మొదలెట్టినట్టు కీలక పత్రాలు బయటకు వచ్చాయి. 10 పేజీలున్న ఈ పత్రాలు మీడియాకు లీక్ అయ్యాయి. పాలస్తీనియన్ల తరలింపును ప్రతిపాదిస్తూ రూపొందించిన పాలసీని ఆర్మీ, ఇజ్రాయెల్ మంత్రిత్వశాఖలతో నిఘా శాఖ పంచుకున్నట్టు పత్రాల్లో పేర్కొన్నారు. గాజాలోని ఓ శరణార్థి శిబిరంపై జరిగిన బాంబు దాడిలో 50మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిలో అల్‌జజీరా జర్నలిస్టు కుటుంబానికి చెందిన 19మంది ఉన్నట్టు సమాచారం.

ముడుపులకు చట్టబద్ధత కల్పించడమే!

ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబర్ 1: రాజకీయ పార్టీలకు విరాళాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పథకం వివరాలు కొందరికే అందుబాటులో ఉండటంపై ప్రశ్నలు లేవనెత్తింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దాతలు అందించే విరాళాల వివరాలు సాధారణ ప్రజలకు అందుబాటులో లేవని, అయితే ఎస్బీఐ (బాండ్లు జారీ చేసే అధీకృత బ్యాంకు), దర్యాప్తు సంస్థలు మాత్రం ఈ వివరాలు పొందే వీలుందని పేర్కొన్నది. రాజకీయ పార్టీలకు డబ్బులు అందించడం ద్వారా ఇది ముడుపులకు చట్టబద్ధత కల్పిస్తున్నదని వ్యాఖ్యానించింది. ఒకవేళ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని భావించినట్టయితే.. విరాళాలన్నీ ఎన్నికల సంఘానికి ఇవ్వాలని, వాటిని ఈసీ రాజకీయ పార్టీలకు సమానంగా పంచిపెడుతుందని పేర్కొన్నది. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ పథకం ప్రభుత్వం, దాతల మధ్య క్విడ్ ప్రో కోకు అవకాశం కల్పిస్తున్నదని పేర్కొన్నది.

రెండున్నరేండ్ల గరిష్ఠానికి నిరుద్యోగం

- అక్టోబర్‌లో నిరుద్యోగిత రేటు 10.05%
- 30 రోజుల్లోనే మూడు శాతం పెరుగుదల
- నెలలో మార్కెట్‌లోకి కోటిమంది ఉద్యోగార్థులు
- సీఎంఐఈ తాజా నివేదికలో బహిర్గతం
- ఉద్యోగ కల్పనలో మనకంటే బంగ్లా, పాక్ బెటర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రంలోని బీజేపీ సర్కారు మాటతప్పింది. ఫలితంగా గతంలో ఎన్నడూ చూడని రీతిలో నిరుద్యోగిత రేటు పెరిగిపోయింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తాజా నివేదిక ప్రకారం.. సెప్టెంబర్‌లో 7.09 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు అక్టోబర్ నాటికి 10.05 శాతానికి ఎగబాకింది. గడిచిన రెండున్నరేండ్లలో కరోనా సంక్షోభం తర్వాత ఈ స్థాయిలో నిరుద్యోగిత రేటు పెరుగడం ఇదే తొలిసారి. గడిచిన నెలరోజుల వ్యవధిలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 6.2 శాతం నుంచి ఏకంగా 10.82 శాతానికి పెరగ్గా, పట్టణాల్లో ఇదే సమయంలో 8.44 శాతానికి చేరింది. దేశవ్యాప్తంగా 1,70,000 ఇండ్లల్లో ఈ సర్వేను నిర్వహించినట్టు సీఎంఐఈ తెలిపింది.

కోటిమంది ఉద్యోగార్థులు మార్కెట్‌లోకి

దేశంలోని మొత్తం శ్రామికవర్గంలో కేవలం 43 శాతం మందికే ఉద్యోగాలు ఉండగా, ఇప్పటికిప్పుడు అర్హతకు తగిన ఉద్యోగాలు కావాల్సినవారు 22 కోట్ల మంది వరకు ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ విషయంలో పొరుగుదేశాలు బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో కొంత మెరుగ్గా ఉన్నాయి. మొత్తం శ్రామికవర్గంలో బంగ్లాలో 54 శాతం మందికి, పాక్‌లో 48 శాతం మందికి ఉద్యోగాలు ఉన్నట్టు సమాచారం. గత అక్టోబర్‌లో భారత మార్కెట్‌లోకి కొత్తగా కోటి మంది ఉద్యోగార్థులు చేరినట్టు సీఎంఐఈ తెలిపింది. ఏటా 6 శాతం వృద్ధితో దూసుకుపోవాలనుకొంటున్న భారత్ ఆర్థికవ్యవస్థకు ఉద్యోగకల్పన ఓ సవాలుగా మారినట్టు వెల్లడించింది. కాగా, ఈ ఏడాది చివరినాటికి పది లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఆర్భాటంగా ప్రకటించారు. అయితే, ఆచరణలో మాత్రం అది జరుగడం లేదని సీఎంఐఈ తాజా నివేదికను బట్టి అర్థమవుతున్నది.



దేశంలో నిరుద్యోగిత రేటు ఇలా..

2020 డిసెంబర్ 1	9.1
2021 మే 1	11.8
2021 ఆగస్టు 1	8.3
2021 డిసెంబర్ 1	7.9
2022 మే 1	7.1
2022 ఆగస్టు 1	8.3
2022 డిసెంబర్ 1	8.3
2023 మే 1	7.6
2023 అక్టోబర్ 1	10.1

వాణిజ్య సిలిండర్‌పై రూ.101 వడ్డన

నెల వ్యవధిలో రెండోసారి ధరల పెంపు

పలు ప్రాంతాల్లో 2 వేలకు చేరిన ధర

- *తగ్గింపు రూ. 257.. పెంపు రూ. 310*
- ఇదీ కేంద్రంలోని బీజేపీ సర్కారు లెక్క
- చిరు వ్యాపారులు, హోటళ్లపై భారం
- పరోక్షంగా సామాన్యులకే ధరాఘాతం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలతో కుదేలైన పేదలకు కేంద్రంలోని బీజేపీ సర్కారు మరో షాక్ ఇచ్చింది. 19 కేజీల వాణిజ్య సిలిండర్‌పై తాజాగా రూ.101.5 బాదింది. నెల రోజుల వ్యవధిలో ధరలను పెంచడం ఇది రెండోసారి. పెంచిన ధరలు బుధవారం నుంచే అమల్లోకి వస్తాయి. తాజా పెంపుతో చెన్నైలో సిలిండర్ ధర అత్యధికంగా రూ. 1,999.5కు, కోల్‌కతాలో రూ. 1,943కు చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో ధర రూ.1833, ముంబైలో రూ.1785.5కి ఎగబాకింది. విమాన ఇంధనం(ఏటీఎఫ్) ధరలను ఈసారి రూ.5.79 శాతం తగ్గాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థలు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశాయి. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్ ధరలో మాత్రం కేంద్రం ఎలాంటి మార్పు చేయలేదు.



ఆవిరైన ఉపశమనం

వాణిజ్య గ్యాస్ సిలిండర్ విషయంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కలిపి కేంద్రం రూ. 257 తగ్గించింది. దీంతో అప్పటికే పెరిగిన ధరలతో కుదేలైన వారు కొంత ఉపశమనం లభించినట్టు భావించారు. అయితే, దీన్ని ఆవిరి చేస్తూ.. అక్టోబర్‌లో రూ. 209ని, తాజాగా రూ. 101.5ను కేంద్రం వడ్డించింది. అంటే మొత్తంగా రూ. 310.5 భారాన్ని మోపింది. దీంతో వాణిజ్య సిలిండర్‌ను వినియోగించే చిరు వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లపై అదనపు భారం పడే అవకాశం ఉన్నది. తద్వారా సామాన్యులైన వినియోగదారులపై ఈ ప్రభావం పరోక్షంగా పడినట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మే 26, 2014న వాణిజ్య సిలిండర్ ధర - రూ. 1,515

నవంబర్ 1, 2023న సిలిండర్ ధర - రూ. 1,999.5

తొమ్మిదిన్నరేండ్లలో పెంపు - రూ. 484.5 (32 శాతం)